
# అద్దెబ్రతుకు

## గొల్లపూడి మారుతీరావు



మీ రెప్పుడేనా విశాఖపట్నం వెళ్ళి యిల్లా నప్పుడు కురుపాం మార్కెట్ పక్క చింను నడుస్తూపోతూంటే కుడిచేతివేపు రామమందిరం కనిపిస్తుంది. దాని పక్క సందువేపు దృష్టి మళ్ళిస్తే (మీరు తిరగక్కరలేదు) ఓ పెంకుటిల్లు కనిపిస్తుంది. అదే — అదే రామనాథంగారి

రామనాథంగారు ఈ లోకంలోకి వచ్చి ఏభైఆరు సంవత్సరాలూ, తాలూకా ఆఫీసులో గుమాస్తాగా కుదురుకుని ముప్ఫై అయిదు సంవత్సరాలూ, ఉద్యోగంనుంచి రిటైరయి పదినెలలూ, ఆయిల్లుకొని ఆరునెలలూ, ఆ మ్మే పి వారంరోజులూ అయింది.

రామనాథంగారు యిల్లు కొంటున్న రోజునే అమ్మేస్తారని నాకు ఎందుకో నమ్మకం కలిగింది. మొహమాట పడకుండా ఆయనతో ఆ మాట చెప్పాను. కాని వినలేదు. 'నీ మొహం! అపశకునం మాటలూ నువ్వూ!' అన్నారు. నాకు అలాంటి నమ్మకం ఎందుకు కలిగిందంటారా?—రామనాథంగారు మంచివారు కనక. ఆయన మంచివాడేనని చిరిగిపోయిన ఆయన పాతకోటూ, కేవలం పసుపుతాడుతో పార్వతి దేవిలా వున్న ముసిలిభార్యా, పెళ్ళయిన పెద్దకూతురూ, పెళ్ళిఅయి ముండమోసిన రెండో కూతురు, ఇంక పెళ్ళికాదని రూఢయిపోయి చదువుకొన్న నాలుగో కూతురు, చనిపోయిన ఆయన పెద్ద కొడుకు చెప్తారు. నిజాయితీ, నిక్కచ్చితనంతో అతను ఉద్యోగంలో ఎందరికో శత్రువయాడు.

మొదట్నుంచీ—అంటే రామనాథంగారు తల్లికడుపున పడినప్పట్నుంచీ— ఆయన అద్దెయింట్లోనే వుంటున్నారు. అద్దెకొంపలో ఓ తల్లి కడుపునపడి, ఆసుపత్రిలోని అద్దె మంచంమీద పుట్టి, అద్దెకొంపలో పెరిగి, పిల్లల్నికని వాళ్ళకి పెళ్ళిళ్ళు చేశాడు.

ఏభై ఆరేళ్ల జీవితంలో—పోయినవీ, వచ్చిపోయినవీ కోరికలు పోగా — మిగిలిపోయింది ఒకటుంది—తనదంటూ చెప్పుకునే యింట్లో బ్రతకడం. అదిన్నాళ్లూ ఎలాగూ సాధ్యంకాలేదు కనక—యిప్పుడా కోరికను కాస్త సవరించారు—తనదంటూ చెప్పుకొనే యింట్లో కన్నుమూస్తే చాలునని. మంచివాళ్లకి — ముఖ్యంగా రామనాథంగారి లాంటి వాళ్లకి — యివి చాలా గడ్డుకోరికలు, సాహసోపేతమయిన కోరికలూను.

రిటైరయాక వచ్చిన నాలుగురాళ్ళూ పట్టుకు నాదగ్గరికి సలహాకి వచ్చినప్పుడు—'మీకు యిల్లెందుకు మేష్టారూ! హాయిగా ఏ పాతికం రూపాయిలిచ్చినా మీ రెండు పెద్ద ప్రాణాలూ బ్రతికేయవచ్చు' అన్నాను. ఆయన మనస్సు ఆ మాటలకి కలుక్కుమంది. ముసలి కళ్లలో ఏ మూలో

నీళ్ళు కదిలినట్టనిపించింది —అయితే ఆ ఆలోచనమీద ఒత్తిడి చెయ్యలేదు. ఆ వచ్చిన డబ్బుతో ఓ కొంప కొనుక్కొని అందులో పడివుండాలని పట్టుబట్టారు రామనాథం గారు. జీవితం యిచ్చిన కష్టాలతోపాటు, యింటి యజమానులు తెచ్చిన నష్టాలను కలబోసుకుని ఆయన యిన్నాళ్ళూ బతికారు — ఇన్నాళ్ళకి కాస్త స్వేచ్ఛగా, సుఖంగా బ్రతకాలని ఆ ముసలి ప్రాణం కలలు కంటోంది.

తంటాలు పడిపడి—యిందాక నే చెప్పిన యిల్లు బేరాని కుదుర్చుకున్నారు. ధర ఎంతయితే ఏం? చేతికిచ్చిన డబ్బు దాదాపు అయిపోయింది — మనస్సుకి కావలసినంత తృప్తి మిగిలింది. పూర్ణకుంభం పట్టుకుని ఆ ముసలిదంపతులు ఆ పాత యింట్లో గృహప్రవేశం చేస్తుంటే, కూతుళ్ళు దేవుడి పటాలను గోడలకి తగిలిస్తూ సంబరపడుతూంటే నాకు కళ్ళనీళ్ళు వచ్చాయి. భేష్! ముసలాడు యిన్నాళ్ళకి నిజంగా నే ఓ మంచిపని చేశాడని సంబరపడ్డాను.

తర్వాత ఓ నెలరోజులపాటు ఆ కుటుంబానికి తీరిక లేదు. యింటి ముందు ఉన్న కాస్త ఆవరణలో ముసలాయన పారా, గునపం పట్టుకొని గొప్పులు తవ్వుతూంటే ఆడపిల్లలు అన్ని రకాల పిచ్చిమొక్కలూ తీసేశారు. బంతి చెట్లూ, చేమంతులూ, జాజి, మరువం, దవనం దగ్గర్నుంచి కొత్తిమీర బచ్చలి వరకూ వేసేశారు.— ఇంటిముందు ఆవరణ మూడోతరగతి ప్యాసెంజరు రైలుపెట్టెలాగ తయారయింది. వేసిన మొక్కల్లో చాల బ్రతకలేదు కాని, వేసిన వాళ్ళ ముఖాలు నవనవలాడుతూ వికసించాయి. తనదంటూ చెప్పుకొనే పిడికెడు స్థలముండే మానవుడికి ఎంత మన్నన!— అనిపించింది.

ఆ యింట్లో అయిదు గదులున్నాయి. వెనకవేపు చిన్న వంటగది, ఒకటూ రెండూ పరిచిన స్నానాలగది—పెద్ద నుయ్యి వున్నాయి. మొత్తానికి—మరీ పెద్దది కాకపోయినా యిమ్మగా వున్నయిల్లే... స్వేచ్ఛగా ఆ యింట్లో ఉన్న నలుగురూ నాలుగ్గదుల్లో పడుకొన్నా మరోగది మిగిలిపోతుంది — ఇంటిముందు పెద్ద బాదంచెట్టు.

నెలరోజులు తిరిగాక—ఓ రోజు కూరల బజారులో తటస్థపడ్డారు రామనాథంగారు —చాలా హడావిడి పడుతున్నారు. కూరల బజారులోనే సగంరోజు గడపేసే ఆయన ఆ రోజు కాలు నిలపకుండా పరుగు లెత్తడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆపి పలకరిస్తే — రెండు మాటలు చెప్పి, 'వస్తానురా కొత్త వెరైటీ గులాబి మొక్క బెంగుళూరునుంచి సంపాదించుకు వచ్చాను. ఎండ వచ్చేలోగా దానికి తడిక అడ్డు కట్టాలి' అని బయలుదేరారు. ఆశ్చర్యపోతూ ఆయన్ని చూశాను. మరి పది సంవత్సరాలు చిన్నవాడిలాగ కనిపించారు. చాలా హాయిగా, హాయి పొందిన జీవితాన్ని గడుపుతున్న వాడిలాగ కనిపించారు.

వెళ్తున్నవాడల్లా ఒక్కక్షణం ఆగి— అంతయిల్లు మాకు మరి ఎక్కువయిపోయిందిరా. ఒకభాగం ఎవరికయినా అద్దెకివ్వాలని అనుకుంటున్నాను.' అన్నారు. నేను దిమ్మరపోయాను.

'మేష్టారూ — అద్దెయింటి యజమానుల బారినుంచి తప్పించుకోవడానికి మీరు యిల్లు కొన్నారు. ఇప్పుడు మీరు యింటి యజమాని కావాలనుకొంటున్నారా?— ఏందుకా బాధ?' అన్నారు.

'నీకు తెలీదురా — పెన్షన్ డబ్బులు అయిపోయాయి. రోజు గడవాలంటే— కొంచెమైనా చేతిలో పైకం వుండాలి కద—నేను అద్దెకి యిచ్చేది అవసరం కొద్దీ కాని — లాభాలకి కాదు' అన్నారు.

ఉద్దేశం మంచిదే — ఆయన చెప్పిన కారణమూ మంచిదే. కాదనలేకపోయాను.

ఒకరోజు యింటికి వెళ్ళాను — అద్దెకివ్వదలచిన భాగానికి అన్నిసౌకర్యాలూ అప్పుడే చేసిఉంచారు రామనాథంగారు — వెనక తడికలతో చిన్న బాత్‌రూం ఏర్పాటు చేశారు—ముందువేపు — వసారాలో చిన్న భాగం అద్దెవాళ్ళకి వేరుగా అమర్చారు— అంతే కాదు. ముందు వేసిన పూల మొక్కల్లో అద్దెవాళ్ళభాగంలో పువ్వులన్నీ వాళ్ళే ఉపయోగించుకో వచ్చునని చెప్పారు. ఆ పక్కన ఒక సన్నజాజి పందిరి — మరువం — డిసెంబరు పువ్వులూ అద్దె వాళ్ళ వాటాకి వచ్చాయి. ఇంత సుఖాన్ని ఏ యజమాని అమరుస్తాడు? వీధిలో కొళాయి — పక్కనే బజారు, అటుపక్క ఆసుపత్రి—పోస్టాఫీసు—అన్నీ ఉన్నాయి— రెండుగదులూ—వంటిల్లూ—బాత్‌రూంకి ఆ ప్రాంతంలో కనీసం ఎనభై ఇస్తాడు ఎవరన్నా—'ఎనభై చెప్పండి' అన్నాను.

అంతే మాష్టారికి భలే కోపం వచ్చింది.

'నేనేం వడ్డీ వ్యాపారస్థుడి ననుకొన్నావా? — దగుల్బాజీ ననుకున్నావా?' అన్నారు.

అర్థంకాక తెల్లబోయాను.

'ఈ యింటిలో వ్యాపారం చేసి— వేలు గడించి మేడలు కట్టాలని కాదు బాబూ ఎవరయినా చిన్నసంసారం ఉన్నవాళ్ళకి— 40కి యిస్తానంతే. ఒక్కపైసా ఎక్కువైనా పుచ్చుకోను.' అన్నారు ఖండీగా.

'కాని అలా యింటికి సుళువుగా ఎనభై వస్తుంది' అన్నారు.

'నికరంగా రాదు. అద్దెవాళ్ళు డబ్బు యిచ్చుకోడానికి పడే బాధ నాకు తెలుసు. వాళ్ళని కష్టపెట్టి నేనేం బాగుపడతాను' అన్నారు.

'కాని ఈమాత్రం యింటికి—కష్టపడకుండానే సుళువుగానే యిస్తారు.' అని నచ్చచెప్పబోయాను.

కాని మేష్టారు వినలేదు. 40 ఏళ్ళ అద్దె జీవితం అతనిమనస్సుమీద భయంకరమయిన ముద్ర వేసింది. — ఆ పీడన ఎంత దారుణమయినదో ఆయనకి తెలుసు. దాన్ని పరోపకారి జీవితంలో— కనీసం తనద్వారా ప్రవేశపెట్టడం రామనాథంగారికి యిష్టంలేదని గ్రహించాను. పైపెచ్చు ఆయన మంచివాడు—మంచివాడి సదుద్దేశాన్ని—దుర్మార్గుడి దురుద్దేశాన్ని మార్చడం కష్టం.

ఆ యింట్లో తెల్లవారేసరికి ఎవరో ఒకరు దిగిపోతారన్న నమ్మకం కలిగింది. చెప్పొద్దూ! నాకే అక్కడ ఉండాలని మనస్సు పీకింది. అలాంటి యిల్లు ఎవరు కాదంటారు? అవన్నీ అటువంటి మంచివాడి పంచన!

కాని ఆశ్చర్య మేమిటంటే—రెండు నెలలు గడిచినా ఎవరూ ఆ యింట్లో దిగడానికి యిష్టపడలేదు. ఎంతోమంది

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్

"బ్లా బ్లా"
హామీ తో
3 బ్యాండ్, ఆల్‌వరల్డ్
పోర్టబుల్ ట్రాన్సిస్టరీను నెలకు రు. 5/- వంతున చెల్లించే పద్ధతిన పొందండి. ప్రతి గ్రామమునకు, నగరమునకు పంపగలము. నేడే వ్రాయండి:
HIND AGENCIES (67)
Kolhapur Road, Delhi-7.

3 నెలలవరకు ఉచిత బహుమతి
కాశ్మీర్ & బెంగుళూర్ ఆర్ట్ సిల్కు చీరెలు సరికొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను, రంగులలోను పూవద్ద గలవు. సిద్ధ సైజులలో మాత్రమే లభించును. 1 సెట్ - చీర రు. 13-50; 2 కి రు. 26; 3 కి రు. 37-50; 4 కి రు. 47. రెండు లేక అంతకుపై చీరె లకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం. మీ ఆర్డరును పోస్టు పార్శిల్‌ద్వారా పంపెదము.

ATLAS LIT CO., (APM-99)
P. B. 1329, Delhi-6.

దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము

నపుంసకత్వము, శుక్ల నష్టము, హస్తప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసము, (దమ్మ) బోదకాళ్లు, చెవుడు, కరుపునొప్పి, కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టులద్వారా కూడా వైద్యము చేయబడును.
శ్రీ బాలాజీ వైద్యశాల,
డా॥ పి. కుమారస్వామి దేవర,
ట్రావెలర్స్ బంగళా రోడ్, తెనాలి.

ఎలెక్ట్రిక్ & రేడియో
ఇంజనీరింగ్ కోర్సు
ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్, అసెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్‌వైజరీ, వైరింగ్ వగైరాలకు సమగ్రమైన గైడ్ (800 బొమ్మలు గలది).
రు. 12-50. వి. పి. పోస్టేజి రు. 2.
M/ CHANDRAS (E)
Box No. 1271. Delhi-6.

# అద్దెబ్రతుకు

వచ్చి చూసి పోతున్నారట. ఈ విషయం తెలిసి నేను నిర్ఘాంతపోయాను. ఎవరూ ఎందుకు దిగలేదో అర్థంకాక తికమక పడ్డాను. చివరికి అర్థమయాక నివ్వెరపోయాను.

అచిరకాలంలో ఆ యింటి గురించి— ఆ యింటి యజమానిగురించి పదిరకాలుగా చెప్పకోవడం విన్నాను.

మేష్టారినడిగితే కొన్ని అంశాలు తెలిశాయి. వచ్చినవాళ్లకి అన్నీ నచ్చుతున్నాయట. అద్దె దగ్గరికి వచ్చేసరికి ఆశ్చర్యపోతున్నారట—సాధారణంగా జరుగుతున్న సంభాషణ యిది.

'అద్దెంత సార్?'

'నలభై'.

'ఏమిటీ ఉత్త నలభైయ్యా?'

'నలభయ్యే'

ఇంతమంచి యింటికి నలభైయేనా?'

అక్కడినుంచి వరసగా ప్రశ్నలు—

'ఇంతకుముందు ఎవరుండేవారు?'

'వాళ్లెందుకు ఖాళీ చేశారు?'

'అసలు ఇంత యిల్లు అమ్మకానికి ఎందుకొచ్చింది?'

'నలభైయేనా? నేను సరిగా వినలేదా?'

యిలాంటి ప్రశ్నలు చాలామందినుంచి వచ్చాయి.

అద్దె తక్కువకావడం అందరిలో ఆశ్చర్యాన్ని మాత్రమే కలిగిస్తే విచారం లేదు. కాని రకరకాల అనుమానాలనీ, ఆలోచనల్ని రేకెత్తించింది. ఇంట్లో ఏదో లొసుగు లేకపోతే అంతమంచి యింటికి నలభై ఏ అద్దె ఎందుకివ్వాలి? — అని ప్రతివాడి అనుమానం. ఆ యింటిగురించి రకరకాల విషయాలు అద్దెవాళ్లు చెప్పకోవడం విన్నాను.

అసలు ఆ యిల్లు సమాధుల మీద కట్టారట—అది అచ్చిరాని యిల్లట — అక్కడ ఉంటున్న ఒక యిల్లాలు — ముందుగదిలో ఉరిపోసుకు చచ్చిందట— ఆ యింటి చెట్టుమీద దెయ్యం ఉందట— అది అసలు దెయ్యాల కొంపేనట !— యిలా చెప్పకున్నారు!

అంతవరకూ అయితే ఫరవాలేదు — 'అతని కూతుళ్లకి పెళ్లి కాలేదు—ఆ విషయం తెలుసా! అదీ అసలు కారణం!' అని కొందరు అనుకొని ముసిముసి నవ్వులు నవ్వుకొన్నారు. మూడో అమ్మాయికి పెళ్లికాకుండా ఉండిపోవడానికి — ఈ యింటికికూడా ఏదో సంబంధం వుందని కూడా అన్నారు కొందరు వ్యక్తులు. 'ముసలాడు మెత్తగా కనిపిస్తాడు కాని యింట్లోకి రానిచ్చి — కోర్టులకి ఇంగాడ్చి ఏడిపించే రకం — లేకపోతే అంతయిల్లు ఎలా కొనగలిగాడంటారు ?' అని మీ మాంసలు లేవదీసి తృప్తిపడ్డారు. వాటిని మాష్టారు ఎలా భరించారో తెలీదు. కాని, ఆయన్ని మొదట్నుంచీ తెలిసిన నాకు ఆ మాటలు విన్నాక మనస్సు కలచివేసి నట్టయింది. ఆయన యిప్పుడిక చెయ్యగలిగేదీ ఏమీ లేదు. ఈ వాటా ఖరీదు 40 రూపాయలే !

ఇంటికోసం వెదికేవాళ్లు 'బజారు పక్కసందులో 40 రూపాయల యిల్లు చూశారా ?' అని నవ్వుకోవడం విన్నాను. ఎవరేనా యిల్లు కావాలంటే 'బజారు సందులో 40 రూపాయల యింటికి మాత్రం పోకండేం ?' అనడం విన్నాను.

'అమ్మో—ఆ విషయం ముందే హెచ్చరించారులెండి మిత్రులు,' అని చిరునవ్వుతో జవాబు రావడమూ గ్రహించాను.

ఆ యిల్లు ప్రజలకు ఒక జోక్ అయిపోయింది. ఎవరేనా తక్కువ అద్దెకు యిల్లు సంపాదిస్తే — 'రామనాథం గారి యిల్లు లాంటిదేనా బాబూ!' అని నవ్వుకోవడం విన్నాను.

తర్వాత ఓ రోజు ఉదయం మేష్టారుగారు పని కట్టుకొని మా యింటికి వచ్చారు ... ఆయన్ని చూసి నిర్ఘాంతపోయాను. మరో పదేళ్లు ముసిలివాడయిపోయినట్టు కనిపించారు.

'మేష్టారూ !' అన్నాను.

'చాలా పెద్దయిబ్బందిలో పడిపోయాన్రా బాబూ. నువ్వే నన్ను రక్షించాలి.' అని నా రెండుచేతులూ పట్టుకున్నారు—

ఏమిటని అడగలేదు—అది వినడానికీ, చెప్పడానికీ చాలా బాధకరమయిన విషయం అని తెలిసి.

'ఇల్లు అమ్మించి పెట్టాలి. ఎంత త్వరగా అమ్మేస్తే అంత సుఖపడతాము'

అన్నారు ఆయన. ఆ క్షణంలో ఆయన ముఖంలో బాధచూసి కళ్లనీళ్లువచ్చాయి.

ఇప్పుడిక ఆ యిల్లు అమ్మడం ఎంత కష్టమో నాకు తెలుసు. అయినా ఆ

## అద్దెబ్రతుకు

విషయం ఆయనకు వివరించలేదు. 'అలాగ చూద్దాం.' అనేశాను.

అన్నంత సులువుగా విషయం పరిష్కారం కాలేదు.

కాని రెండు నెలలపాటు నానా యిబ్బందులుపడి—బ్రోకర్‌కి యివ్వాలసిన దానికంటె ఎక్కువ కమీషన్ యిచ్చి—ఎవరో పై వూరు పార్టీకి అమ్మకం చేసేశాం. మాష్టారుగారుయిల్లు ఖాళీ చేస్తున్నప్పుడు నేనూ దగ్గర ఉన్నాను.

ఇంటిని వదిలించుకుంటున్నందుకు ఆయన మనస్సులో ఎక్కడో తృప్తి ఉన్నదేమో తెలీదుకాని—ఆ కోరికను యింత క్రూరంగా త్రుంచి వేస్తున్నందుకు ఆయన ముఖంలో దుఃఖం గుర్తుపట్టగలిగాను. పిల్లలు—తాము స్వయంగా వేసి పెంచిన పూలమొక్కల్ని దిగులుగా చూస్తూ గుమ్మం దాటారు.

మాష్టారుకి ఆ వయస్సులో—ముఖ్యంగా ఆయన నమ్మకాలమీద—తగలవలసిన దెబ్బ కాదది. దానికి పూర్తిగా నలిగిపోయారాయన. మనిషి బాగా క్రుంగిపోయారు.

పాత ఉత్సాహంకూడా ఆయనలో పోయింది.

ఈ బాధాకులిత ప్రపంచంలో మేష్టారు రూపంలో ఎదురయిన మంచితనాన్ని ఎవరూ నమ్మలేక పోయారు. మంచితనానికి ఫేస్‌వేల్యూ చెడింది. ఆఖరికి మేష్టారి వ్యక్తిత్వంమీద, శుభ్రంమీద ఆ ప్రభావం పడింది. ఆయన జీవితమూ శిథిలమయింది.

ఒక చిన్న యిల్లు ముప్ఫై రూపాయలకి అద్దెకు పుచ్చుకుని అందులో దిగారు. మళ్లీ అద్దె జీవితం ప్రారంభమయింది. ఆ చివర [illegible] న్యాయంగా కొన్నాళ్లయినా [illegible] పిల్లలకు—ఆ [illegible] అద్దె కొంపలో విశ్రాంతి తీసుకోవలసిన పరిస్థితి అది.

అయితే మేష్టారు విశ్రాంతి తీసుకొన్నారు. మరి కొద్దిరోజుల్లోనే—అద్దె కొంపలో ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నారు. ●

# విద్యార్థులలో ఆత్మహత్యలు

ఇటీవల ప్రపంచంలో విద్యార్థి ఉద్యమాలు బాగా ప్రసిద్ధి పొందాయి. రాజకీయాలు వ్యక్తిగత సమస్యల ప్రాముఖ్యతని తగ్గించాయి కాని, చాలా దేశాలలో విద్యార్థులలో ఆత్మహత్యలు ఎక్కువ అవుతున్నాయి. పశ్చిమజర్మనీలో జరిగిన ఒక పరిశీలన ఫలితాలు కొన్ని ఈ కింద ఇవ్వబడుతున్నాయి.

### పశ్చిమ జర్మనీలో ప్రేమ పెద్ద సమస్య

పశ్చిమజర్మనీలో ప్రతి సంవత్సరం 110—120 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటారని 44000 కేసుల ఫైళ్లని పరిశీలించిన ఎబర్‌హార్డ్ ఉంగర్ హవుసెన్ అనే ఉపాధ్యాయుడు అంచనా వేశాడు. మామూలు జనాభాలోకన్నా విద్యార్థి వర్గంలో ఆత్మహత్యలు ఎక్కువ. ఆడవారికి సంబంధించిన లెక్కలు విడిగా చూస్తే విద్యార్థినులలో మామూలు వనితలకన్నా ఆత్మహత్యలు రెండు రెట్లు అధికం.

'ఆశలు, ఆశయాలు ఎక్కువ అయినప్పుడు మానసికాందోళన అధికం అయ్యే అవకాశాలు ఎక్కువ' అంటాడు ఫిలిప్‌లెర్స్ అనే ఒక జర్మన్ మనశ్శాస్త్రజ్ఞుడు.

అంతే కాదు—ఎందరో యువతి యువకులు జీవితంలో ఎదుర్కొనే బాధ్యతలని తలుచుకుని భయపడి వాటిని తప్పించుకునేందుకు విశ్వవిద్యాలయాలలో చేరుతారని ఆయన, మరికొందరూ అంటున్నారు.

ఇక ఆత్మహత్యలకి దారితీసే సమస్యలని పరిశీలిస్తే మగవారిలో 30 శాతం, ఆడవారిలో 61 శాతం ప్రేమలో కలిగిన మానసికాఘాతాని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిసిందిట.

ఎందరో వనితలు మగవారితో పోటీ పడినప్పుడు తమ శారీరిక కష్టాల సాయంతో నెగ్గటానికి ప్రయత్నించి తర్వాత దీనివల్ల పశ్చాత్తాపానికి లోనవుతారని పరిశోధకులు అంటారు.

బుద్ధిపూర్వకంగా కొన్ని సిద్ధాంతాలని కాదన్నప్పటికీ మత ప్రభావాన్ని తొలగించటం కష్టం అంటారు. ఇది వివాహాలలో వచ్చే అలజడులలో బాగా గమనించ తగ్గదిట.

విద్యార్థులలో 28—29 వయస్సు కలవారిలో ఆత్మహత్యలు అత్యధికం అని పరిశోధనలు తెలుపుతున్నాయి.

పరీక్షలలో తప్పటంవల్ల ఆత్మహత్య చేసుకునేవారిలో మగవారు అదికం. దీని కొక చిత్రమయిన కారణం ఉంది; పరీక్షలలో తప్పిన ఆడవారు వివాహంలో, మాతృత్వంలో మునిగి సరిపెట్టుకొనడం చేత వారి పరిస్థితి మెరుగుగా ఉంటుందట.

విద్యార్థులలో 40 శాతం సాంఘికంగా 'పై' తరగతులవారుట, ఆత్మహత్యా ప్రయత్నం చేసేవారిలో 49 శాతం ఈ తరగతులవారేట, ఈ ప్రయత్నంలో విఫలులయ్యేవారు 57 శాతంట; అంటే, ఈ తరగతులవారిలో ఎందరో గొప్పకోసమే కళాశాలలకి వెడ్తారన్నమాట (ఉంగర్ హవుసెన్ ప్రకారం.) విశ్వవిద్యాలయాల అధికారులు ఈ సమస్యలని మరింత శ్రద్ధగా పరిశీలించాలని ఉంగర్ హవుసెన్ అంటాడు.

—జార్జ్ ఎం. బీ (పో వ ఫి)